# స్మృతులు

రాత్రి తొమ్మిది గంట లైంది.

విశ్వేశ్వరరావు అప్పుడే భోజనంచేసి, వరండాలోని పడకకుర్చీలో ఆయాసంగా మేనువాల్చి చుట్ట వెలిగించాడు. చూపులు పొగలతో కలిసి, ఎక్కడికో దూరంగా వెడుతున్నాయి. చూడగలిగినంత దూరం వెళ్ళి శూన్యంలో విలీనమవుతున్నాయి. విశ్వేశ్వరరావుకు ఎందుకో తన చూపులు కళ్ళనుంచి విడిపోతున్నట్లు తోచింది. మెదడులో ఎందుకో కలకాలం నాటి కారు చీకట్లు పొరలు పొరలుగా విచ్చుకుంటున్నాయి. స్మృతుల మిణుగురులు క్రమంగా పొరల్ని వెలిగిస్తున్నాయి. ఒక పొరలో ఒక మిణుగురు తళుక్కుమంది ... రఘు రామచంద్రపురం దక్షిణాన వున్న మామిడి తోటలో జిగేలున మెరిశాడు...నొసట సాదుచుక్క నల్లగా తళతళ లాడుతున్నది...ఊసుపిర్రల మీదినించి కిందికి జారుతున్న నిక్కర్ని మాటి మాటికి పైకి ఎగదోస్తూ ఎవరో ఒక కుర్రవాడితో పోట్లాడుతున్నాడు ... ఎన్ని పొరలు వెతికినా ఆ కుర్రవాడు ఎవరో విశ్వేశ్వరరావుకు ఏ మాత్రం జ్ఞాపకం రావడంలేదు...కాని రఘు తనను వెనకేసు కొచ్చి, ఆ కుర్రవాడితో పోట్లాడుతున్నట్లు విశ్వేశ్వరరావుకు తోచింది ... తాను వెనకాల ఎక్కడో నిలబడ్డాడు ... రఘు ముందుకు వెళ్ళి ఆ కుర్రవాడితో కలియబడుతున్నాడు. తనకు అప్పట్లో రఘు, యిద్దరు రఘులుగా కనబడ్డారు. జారిపోతున్న నిక్కర్ని పదేపదే పైకి ఎగదోస్తున్న రఘు ఒకడు — తనకోసం హోరా

హుషారీగా పోట్లాడుతున్న రఘు ఇంకొకడు. ఆ యిద్దరు రఘుల్లో, తనకోసం పోట్లాడుతున్న రఘు తనకు ఎందుకో నచ్చలేదు. అమాయకంగా నిక్కర్ పైకి ఎగదోస్తున్న రఘే తనకు యిష్టం. ఇంకొక పొరలో ఇంకొక మిణుగురు జిగేలుమంది... విశ్వేశ్వరరావుకు, తన యింటి ప్రక్కనే రఘు యిల్లు కన బడింది...రఘు తలిదండ్రులు, తనను గారాబంగా చూడ్డం, తానూ, రఘూ సాతాని రంగాచారి బడిలో పక్క పక్కన కూర్చొని చదువుకోవడం, బడివదలంగానే కలిసి ఆడుకోవడం ఒక్కొక్క రోజు ఆడుకొని ఆడుకొని, రఘు యింటిలోనే పడు కోవడం....మిణుకు మిణుకు మంటున్నాయి....విశ్వేశ్వరరావు విడిపోయిన చూపుల్ని శూన్యంలో వదలి సంతృప్తితో కళ్ళు మూసుకొన్నాడు. తృటికాలం తరువాత ఎందుకో అసంతృప్తి, తనను వీడి దూరంగా .... ఇంకా దూరంగా వెడుతున్నట్టు తోచింది. క్రమంగాహృదయాన్ని ఏదోఅశాంతిఆవరిస్తున్నది.

విశ్వేశ్వరరావుకు, ఆ చిన్ననాటి రఘుకూ, నేటి రఘుకూ ప్రస్తుతం ఎంతో వ్యత్యాసం కనబడుతున్నది. విశ్వేశ్వరరావు ఆ రోజే ఢిల్లీనుంచి హైదరాబాదు వచ్చి రఘు ఇంటిలో దిగాడు. స్టేషన్‌కు రమ్మని రఘుకు ఉత్తరం వ్రాశాడు. కాని రఘు ఎందుకో స్టేషన్‌కు రాలేదు. రైలు ఆలస్యంగా రావడంవల్ల బహుశా రఘు, స్టేషన్‌లో తనకోసం ఎదురు చూచి కాలేజీకి వెళ్ళి ఉంటాడు. 16 సంవత్సరాల తరువాత రఘును ఆ రోజే తాను కలుసుకోవడం. తనకు రఘు అడ్రస్ తెలిసి ఉండడంవల్ల నేరుగా అతని ఇంటిలో వచ్చి దిగాడు. రఘు భార్య కూడా, తన కోసం ఎదురు చూస్తున్నట్లే కనబడింది. తనను ఆమె ఎప్పుడూ చూడలేదు.

కాని వచ్చి రావడంతోనే విశ్వేశ్వరరావుగారు మీరేనా అని అడిగి లోపలికి రమ్మని చెప్పింది. వారు మీకు స్టేషన్‌లో కనబడలేదా అని ప్రశ్నించింది. విశ్వేశ్వరరావు, వెంటనే స్నానం చేసి భోజనానంతరం ప్రయాణ బడలికవల్ల కొద్దిగా కునుకు తీశాడు. అరగంట తరువాత మెలుకువ వచ్చింది. ఎంత సేపని పక్కలో దొర్లడం — పుస్తకం ఏదైనా చూస్తూ కాలం గడుపుదామని రఘు పుస్తకాలన్నీ వెతికాడు. బీరువాల్లో అన్నీ సైన్సు పుస్తకాలే. తనకు సైన్సు బొత్తిగా తెలియదు. నాటకమో, నవలో ఉంటే హాయిగా కాలం గడిచేది. ఆ సైన్సు పుస్తకాలన్నీ చూస్తుంటే, లోకం, తన మధ్య, రఘు మధ్య ఎన్నో గోడల్ని పేర్చి తనను రఘుకు దూరం చేసినట్లు తోచింది. తన చిన్ననాటి రఘును ఆ గది గోడల్లో వెతుక్కోవడం ఎంతో కష్టంగా తోచింది. చిన్నతనంలో వ్యక్తుల చుట్టూ ఏ ఆవరణలూ ఉండవు. ఏ వ్యక్తి అయినా స్వచ్ఛంగా, మాయ మసకలు లేకుండా కనపడుతాడు. పెరుగుతున్నకొద్దీ వ్యక్తిచుట్టూ ఏక కేంద్ర వృత్తాలు ఏర్పడుతాయి. వాటిని పగలగొట్టి కొంతదూరం వరకు మాత్రమే మనం సన్నిహితంగా వెళ్ళగలం. ఎందుకో కొన్ని వృత్తాలైనా పగులగొట్టి ఆనాడు రఘుకు సన్నిహితంగా వెళ్ళాలని విశ్వేశ్వరరావు హృదయం ఆరాట పడింది. లాగును పైకి ఎగదోస్తున్న రఘు తిరిగి అతని కళ్ళలో జిగేలున మెరిశాడు. ఆ దృశ్యంనుంచి చూపుల్ని నెమ్మదిగా మరల్చుకొని, అనాలోచితంగా పక్కకు చూచేసరికి, పక్కన ఇంకో కుర్చీలో రఘు కనపడ్డాడు. ఎప్పుడు వచ్చాడో విశ్వేశ్వరరావుకు తెలియదు.

"ఏమిటి ఆలోచిస్తున్నావు?" అని రఘు తనను అడిగాడు.

"ఆ, ఏమీలేదు" అన్నాడు విశ్వేశ్వరరావు. రఘు సాయంత్రం కాలేజీనుంచి వచ్చినప్పటినించీ సంభాషణ, ఇదే విధంగా నిస్సారంగా నడుస్తున్నది. చిన్ననాటి స్నేహితులమని ఉభయులూ అప్పుడప్పుడూ మాటలమధ్య తెచ్చిపెట్టుకుం టున్న ఉత్సాహం వారినే ఎదురుతిరిగి వెక్కిరిస్తున్నది. సాయంత్రం మిత్రు లిద్దరూ నగరం చూడడానికి వెళ్ళారు. కొత్తచోటు చూస్తున్నానన్న ఉత్సాహం, విశ్వేశ్వరరావులో అప్పుడప్పుడు ఎగిరి గంతేసినా మళ్ళీ మామూలు మాటల్లో పడేసరికి, చచ్చి ఊరుకునేది.

విశ్వేశ్వరరావుకు, రాత్రి భోజనంకూడా అంతగా రుచించలేదు, రుచులు మారాయి. వ్యక్తులుకూడా మారారు, వ్యక్తులచుట్టూ ఏకకేంద్ర వృత్తాలు మొలచి, మహావృక్షాలై వారిని, కనబడనీయకుండా దట్టంగా అల్లేస్తున్నాయి. తనమధ్య రఘుమధ్య మౌనం గడ్డకట్టి గోడలు లేపింది. విశ్వేశ్వరరావు "ఆ ఏమీ లేదని"కూడా దాదాపు పది నిమిషాలు దాటి వుంటుంది.

గడ్డకట్టిన గోడలు, క్షణక్షణానికి లావెక్కి తన మధ్య, రఘుమధ్య పర్వతాల్నీ, సముద్రాల్నీ, మహారణ్యాల్నీ నిలిపితే? వాటికి చోటిచ్చి తాను రఘుకు దూరంగా ఇంకా దూరంగా తొలగగలడా? ఎందుకో ఆ స్థితి చాలా భయంకరంగా తోచింది. శరీరం జిలజిలమన్నది. ఆ పర్వతాలకూ, సముద్రాలకూ, అరణ్యాలకూ చోటు ఇవ్వడం యిష్టంలేక బలవంతంగా లేని ఉత్సాహాన్ని తెచ్చుకొని "రఘూ! నీకు మాధవుడు

జ్ఞాపకం ఉన్నాడా?" అన్నాడు. తన ఉత్సాహం తనకే వెటకారంగా ధ్వనించింది, విశ్వేశ్వరరావుకి.

"ఏ మాధవుడు?"

"ఒకరోజున నీవు ఊరి వెలుపల ఉన్న వేపచెట్టుకింద వాడి తల నాకోసం బద్దలుకొట్టావే వాడు."

నీ కోసమా! తల బద్దలుకొట్టానా!!"

"అవును నాకోసమే. ఆరోజు కోతికొమ్మచ్చి ఆట ఆడుకుంటున్నాం. మాధవుడు దొంగైనాడు. వేపచెట్టుపైకి ఎక్కి, నేను వాణ్ణి ముట్టుకుంటే నా చేతుల్లోంచి తన చొక్కా లాక్కొని, కొమ్మపైనుంచి కిందికి దూకి, నన్ను ముట్టుకో లేదు, నేను దొంగను కాలేదని అన్నాడు. మీ యిద్దరిలో నేనే చాలా చిన్నవాణ్ణి. అరగంట అవస్థపడి వాణ్ణి నేను ముట్టుకుంటే, ముట్టుకోలేదని వాడు బొంకడంతో నీకు అమాంతంగా వాడిపైన కోపమొచ్చింది. నీకు ఎందుకుకోపమొచ్చిందో నాకు తెలుసు. నేను చిన్నవాణ్ని అనీ, అరగంటనించి అవస్థ పడుతున్నాననీ, కాగా ఆనాడు నీకు కొబ్బరీ, బెల్లం ఇంటిలో దొంగిలించి పెట్టాననీ, నీకు నాపై జాలివేసింది."

"ఆ రోజుల్లో నీవు చేసిన దొంగతనాలు, ఇన్నీ, అన్నీ కావు. రోజూ ఏదో తినుబండారం యింటిలోనించి తెచ్చి, బడిలో నాకు పెట్టేవాడివి. ఇద్దరం పంతులు కంట పడకుండా తినేవాళ్ళం. కాని, ఆ మాధవుడు ఎవ్వరో ఎంతకీ జ్ఞాపకం రావడం లేదు" అన్నాడు రఘు.

రఘు చుట్టూ మూగిన వృత్తాలు, ఒక్కొక్కటిగా అదృశ్యం అవుతున్నట్లు విశ్వేశ్వరరావుకు తోచింది, ద్విగుణీ

కృతోత్సాహంతో తిరిగి అందుకున్నాడు విశ్వేశ్వరరావు తన కథనాన్ని.

"మీ యింటికి ప్రక్క సందులో ఉండేవాడు. ఎప్పుడూ మనతో తిరుగుతుండేవాడు. నీవు వాణ్ని చూస్తే అసహ్యించుకునేవాడివి. పైగా, ఎప్పుడూ కోతి వెధవా అని తిట్టేవాడివి."

"అల్లానా ?"

"ఏం, నీకు ఇంకా జ్ఞాపకం రావడంలేదా ?"

"ఏదో మసక మసకగా జ్ఞాపక మొస్తున్నది. కాని వాడిని సరిగా పోల్చుకోలేక పోతున్నాను."

"వాడు గాండ్ల అని నాకు జ్ఞాపకం, కాని తండ్రి వ్యవసాయం చేసేవాడు. అంత ఆస్తిపరులుకూడా కారేమో! కొన్ని రోజులు వాడి తల్లి మీ ఇంటిలో పాచిపని చేసినట్టు నా అనుమానం."

రఘుకు మాధవుని గూర్చి ఏమీ జ్ఞాపకం రాలేదు. కాని ఎంతో కాలంనుంచి విశ్వేశ్వరరావు వాడినిగూర్చి చెప్తుతుంటే తనకు అప్పటికీ జ్ఞాపకం రాలేదని చెప్పడం, అమర్యాదగా తోచి...

"ఆ ఇప్పుడు జ్ఞాపకం వచ్చింది. వాడా, ఆ కోతి వెధవ..." అన్నాడు.

రఘును చుట్టివేసిన కొన్ని వృత్తాలు విడిపోవడంతోనే విశ్వేశ్వరరావుకు అమితానంద మేసింది. రఘు నిజస్వరూపం లోని ఒక అంశం బయట పడినట్లు తోచింది అతనికి.

"పాపం! వాడీ మధ్యనే చనిపోయినట్లు మొన్న నాకు ఢిల్లీలో తెలిసింది."

"అరే పాపం, జబ్బేమిటట ?"

"పక్షవాతం వచ్చి, కొన్ని రోజులు మంచంపట్టి చని పోయినాడని ఢిల్లీలో మన ఊరి నారాయణ చెప్పాడు."

"వాడు తలి తండ్రులకు ఒక్కడే కొడుకు కదూ?"

"ఒక్కడే నని విన్నాను."

"పాపం! వాళ్ళు, పెద్ద వాళ్ళయి ఉంటారు. వాళ్ళ బ్రతుకు ఎట్లా గడుస్తున్నదో తెలియదు."

"ఏమో, తొందరలో నారాయణ వివరాలేమీ చెప్పలేదు"

మిత్రు లిద్దరూ మాధవుని గూర్చి కాసేపు విచారించి పొద్దుపోవడంవల్ల ఆవలిస్తూ లేచారు. రఘు విశ్వేశ్వరరావుకు అతని పడకగది చూపించి, లోపలికి వెళ్ళి పడుకున్నాడు.

పడకపైన విశ్వేశ్వరరావు మేనువాల్చాడే కాని, అతనికి ఎంత సేపటికీ నిద్దర రాలేదు. మాధవుని గూర్చి నారాయణ చెప్పిన సంగతులన్నీ నెమరువేస్తూ పక్కపైన దొర్లుతున్నాడు. చిన్నతనలో తనకు మాధవుడనే మిత్రుడు ఉండేవాడా అని సందేహం వేసింది. నారాయణ చెప్పిన మాటల్ని బట్టి ఉండే ఉంటాడు. ఎందుకో మాధవుని ఉనికి పూర్తిగా జ్ఞాపకం రాలేదు. లీలగా, ఏదో వ్యక్తి తననూ, రఘూనూ 14 సంవత్సరాలతరువాత సన్నిహితపరిచాడు. అతని చుట్టూ మొలిచిన వృత్తాల్ని పగులగొట్టాడు. మాధవుడు—ఉన్నా లేకపోయినా తన కర్తవ్యాన్ని నిర్వర్తించి, అవతారం చాలించాడని విశ్వేశ్వరరావు సంతృప్తి జెందాడు. అంతే; ఆ తరువాత అతనికి ప్రశాంతంగా నిద్దర పట్టింది.

★